356)సామంతం/కాంభోజి

ప॥ ఇప్పుడే నే నొడబడ మరవగదగదుజెప్పితి యెల్లనాడు।
నెప్పున నేనెంతకల్లరినైనా నీదాసుడనని యందురుగా॥

చ॥ మఱతునో తలతునో నిన్ను మాటల నేతప్పు గలుగునో।
యెఱుగక నీదాసులజూచి యేమని పలుకుదునో।
నెఱిసిననాకర్మఫలంబులు నీకు సమర్పణ సేసితిని।
మఱి నామీదట నేరము లెంచక మాధవ నన్నిట రక్షించవే॥

చ॥ అలతునో సొలతునో నే నీయందు భక్తిసేతునోసేయనో।
యెలమిని నీకు నివేదించక యేమేమి భుజియింతునో।
తలచేటినామనసే నీకును ధనముగా గప్పము వెట్టితిని।
పలుమరు నున్నను తగవుకుదియ్యక పరమాత్మా నను గావగదే॥

చ॥ నేరనో నేర్తునో నీకైంకర్యము నేమము లేమేమి మానితినో।
నీరూపము నే సేవించి యెక్కడ నే ననుమానించితినో।
మేరతోడ మావారు చెప్పగా మిమ్మింతట నేనమ్మితిని।
వారి జూచైన శ్రీవేంకటేశా వరదుడవై మము మన్నించగదవే॥